క్లుప్తంగా

సద్వినియోగం చేసుకోండి



అంగన్‌వాడీ కేంద్రంలో పీడీ

రొంపిచెర్ల: అంగన్‌వాడీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి అన్నారు. ఆమె శనివారం రొంపిచెర్ల–2 అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, అంగన్‌వాడీ టీచర్ సంపత్ కుమారి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలిసెట్ ధ్రువపత్రాల పరిశీలన

పలమనేరు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో పాలిసెట్ ధ్రువపత్రాల పరిశీలన శనివారం ప్రారంభమైంది. ఈనెల 28 దాకా ఈ కార్యక్రమం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ సాయిలక్ష్మీప్రసన్న తెలిపారు. ఇప్పటికే ర్యాంకుల వారి షెడ్యూల్ ప్రకటించామని ఆమేరకు విద్యార్థులు ఇక్కడికి హాజరుకావాలని ఆమె సూచించారు. ఇందుకు హాజరయ్యేవారు సూచించిన సర్టిఫికెట్లను తీసుకురావాలని తెలిపారు.

లక్ష్యంతో ముందుకెళ్లి విజయం సాధించాలి



డిగ్రీ పట్టా తీసుకుంటున్న విద్యార్థిని

పలమనేరు: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విజయం సాధించాలంటే ఓ లక్ష్యంతో ముందుకెళ్లాలని మదర్‌థెరీసా ఎంబీఏ కళాశాల కరస్పాండెంట్ డా.రవీంద్రబాబు అన్నారు. ఆమేరకు స్థానిక కళాశాలలో శనివారం ఎంబీఏ పూర్తిచేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈసందర్భంగా వారికి డిగ్రీ, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కళాశాల చైర్మన్ సునీల్, అడ్వైజర్ డా.రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ డా.వెంకటరావు, హెచ్‌ఓడీ వీణ పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలికి తీవ్రగాయాలు

వి.కోట: వెనుక నుంచి బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. మండలంలోని తోటకనుమ గ్రామానికి చెందిన నాగమ్మ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం రాత్రి కూలీ పనులు పూర్తి చేసుకుని ఇంటికి తిరిగి వెళుతోంది. ఆసమయంలో వెనుక నుంచి బైక్‌లో వచ్చిన ఓ యువకుడు ఆమెను ఢీకొట్టాడు. ఈప్రమాదంలో తీవ్రగాయాలతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అక్కమ్మ దేవత తిరునాళ్ల



గెరిగను ఊరేగిస్తున్న భక్తులు

గుడిపాల: మండలంలోని రామభద్రాపురం గ్రామంలోని గ్రామదేవత అక్కమ్మ దేవత తిరునాళ్ల శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి అభిషేకం నిర్వహించి, విరుపాక్షమ్మ దగ్గర పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మేళతాళాలు మధ్య, బాణసంచా వేడుకలతో వైభవంగా ఉత్సవ మూర్తులు అమ్మవారి గెరిగలను జోడించి ఊరేగింపు నిర్వహించారు. ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్, గ్రామస్తులు సురేంద్రబాబు, అమరేంద్ర బాబు, వరదరాజులు, సురేంద్రనాయుడు, శ్రీధర్, ధనంజయ, గోవర్ధన్, వినాయక, నరసింహ, మనుమంతనాయుడు, సందీప్, చరణ్ పాల్గొన్నారు.

కూటమి పాలనలో కోట్లు స్వాహా!

- నిత్యం ఇసుక అక్రమ రవాణా
- మట్టి కోసం చెరువులు సర్వనాశనం
- యథేచ్ఛగా కర్ణాటకకు బియ్యం అక్రమ రవాణా
- నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్ రవాణా
- పచ్చనేతలకు కాసులు కురిపిస్తున్న అక్రమ వ్యాపారాలు



కౌండిన్య నదిలో ఇసుక తవ్వకాలు



కుప్పం ప్రాంతంలో అక్రమ మైనింగ్

పలమనేరు: కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా అక్రమ కార్యకలాపాల ద్వారా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేస్తోంది. ఆ మేరకు పలమనేరు నియోజకవర్గంలోని చెరువులు, కౌండిన్య నదిలో ఇసుక తవ్వకాలు, మట్టి మాఫియా, జిల్లా నుంచి కర్ణాటకలోని బంగారుపేటకు బియ్యం, తమిళనాడుకు గ్రానైట్ రవాణాతోపాటు విచ్చలవిడిగా మద్యం అమ్మకాలతో కూటమి స్మగ్లర్లు పబ్బం గడుపుకుంటున్నారు. ఎన్ని అక్రమాలు జరిగినా ఆయా శాఖల అధికారులు నోరెత్తరాదనే పార్టీ పెద్దల ఆదేశాలతో అధికారులు సైతం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో కేవలం పలమనేరు నియోజకర్గంలోనే ఈ ఏడాదిలో కోట్లాది రూపాయలను అక్రమార్కులు యథేచ్ఛగా దోచుకున్నారు. మొత్తం మీద ఏడాదిలో రూ.123 కోట్ల దాకా అక్రమాలు సాగినట్టు తెలుస్తోంది.

రోజుకు 200 లోడ్ల ఇసుక తరలింపు

నియోజకవర్గంలో ఇసుక ఫ్రీ పాలసీ పేరిట ఇసుకాసురులు సగటున రోజుకు 200 లోడ్ల ఇసుకను తోడేస్తున్నారు. ఈ లెక్కన నెలకు ఆరువేల లోడ్లు అంటే ట్రాక్టరు రూ.3వేలు అనుకున్నా రూ.1.8కోట్లు ఏడాదిలో రూ.21 కోట్ల వరకూ దోపిడీ జరిగింది.

మట్టి మాఫియా జోరు

నియోజకవర్గంలో వందకు దాకా ఎంఐ ట్యాంకులు, 400 వరకూ చిన్నపాటి చెరువులున్నాయి. వీటిలో కూటమి పేరు చెప్పుకుని ఆయా చెరువుల వద్ద అక్రమార్కులు నిత్యం వందలాది లోడ్ల మట్టిని తోడి తరలించారు. ఈ ఏడాదిలో కేవలం మట్టి ద్వారానే రూ.10కోట్ల మేరకు అక్రమాలు జరిగినట్టు అంచనా.

జోరుగా గ్రానైట్ రవాణా

పలమనేరు మైనింగ్ శాఖ పరిధిలో పలుచోట్ల అక్రమ క్వారీలు, స్టోన్ క్రషింగ్ యూనిట్లు పనిచేస్తున్నాయి. వీటిల్లో వేటికి లైసెన్సులున్నాయి? ఏవి అక్రమంగా నడుస్తున్నాయో? అనే విషయం కూడా ఇక్కడి మైనింగ్ అధికారులకు తెలియడం లేదు. కేవలం ఈ ఏడాదిలోనే మైనింగ్ ద్వారా రూ.30 కోట్ల దాకా అక్రమ రవాణా జరిగినట్టు తెలుస్తోంది.

మొత్తంగా ఏడాదిలో రూ.123కోట్ల అక్రమాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆపార్టీల పేరు చెప్పుకొని అక్రమార్కులు పలు రకాల స్మగ్లింగ్‌ల ద్వారా నియోజకవర్గంలో రూ.123కోట్ల దాకా సొమ్ము చేసుకున్నట్టు తెలుస్తోంది. ఇటీవల కౌండిన్య నదిలో ఇసుకాసురులను అడ్డుకున్న మున్సిపల్ కమిషనర్‌పై స్మగ్లర్లు దౌర్జన్యానికి దిగారు. పోలీసుల సాక్షిగా హైవేలో ఇసుక ట్రాక్టర్లు వెళుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

బియ్యం అక్రమ రవాణా

జిల్లాలోని తూర్పు మండలాలు, తమిళనాడుల నుంచి పలమనేరు మీదుగా నిత్యం 10 లారీల బియ్యం కర్ణాటకలోని బంగారుపేటకు అక్రమరవాణా అవుతోంది. ఈ లెక్కన నెలకు 300 లోడ్లు, ఏడాదికి రూ.60 కోట్ల వరకూ అక్రమాలు జరిగినట్టు సమాచారం. ఇక మద్యం దుకాణాల ద్వారా బెల్టు షాపులు, పొరుగునే ఉన్న కర్ణాటక మద్యం అక్రమ రవాణా ద్వారా ఏడాదిలో రూ.2కోట్ల దాకా అక్రమాలు సాగినట్టు ఆరోపణలున్నాయి.



బంగారుపేటకు అక్రమంగా వెళుతున్న బియ్యం(ఫైల్)



హైవేలో పగలే వెళుతున్న ఇసుక ట్రాక్టర్



మట్టిని తోడేయడంతో గుంతలమయమైన బైరెడ్డిపల్లి పెద్దచెరువు

అక్రమాలను అరికట్టేదెవరు?..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిలోనే కోట్లాది రూపాయల స్మగ్లింగ్ జరిగింది. ఇదంతా ఆయా శాఖల అధికారుల సాక్షిగా సాగింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది ప్రజలకు మేలు చేసేందుకు కాదు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాగుపడేందుకు మాత్రమే అనే విషయం ఇప్పుడు సామాన్యులకు సైతం అర్థమైంది.

వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే, పలమనేరు

స్మగ్లింగ్‌లు అన్నీ హైవే పైనే



పలమనేరు మీదుగా ఇటు పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె, గుడియాత్తం, నంగిలి రోడ్ల మీదుగా ఇసుక, గ్రానైట్, పశువులు, బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. గతంలో ఎన్నో ప్రభుత్వాలున్నా ఎప్పుడూ ఇంతలా లేదు. అధికారులు సైతం అసలు పట్టించుకోవడం లేదు.

బాగారెడ్డి, పెద్దపంజాణి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్

మా ఊర్లోనే పాఠశాల ఉండాలి



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న నెర్నిపల్లి గ్రామస్తులు

వి.కోట: మా ఊరి పాఠశాలే మాకు కావాలి, మోడల్ ప్రైమరీ స్కూల్లో విలీనం చేయొద్దు అంటూ నెర్నిపల్లి ఉర్దూ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని నెర్నిపల్లి ఉర్దూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలను దండుపల్లి ఉర్దూ పాఠశాల మోడల్ స్కూల్‌లో విలీనం చేసిన విషయంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంఆర్‌సీ వద్దకు చేరుకుని ఎంఈఓ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు. వారు మీడియతో మాట్లాడుతూ తమ గ్రామంలో 70 ఏళ్లుగా కొనసాగుతున్న ఉర్దూ ప్రాథమిక పాఠశాల విలీనం ద్వారా చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. యథావిధిగా పాఠశాలను కొనగాగించాలని లేకుంటే 3,4,5 తరగతులకు తమ పిల్లలను మోడల్ ప్రైమరీ స్కూల్‌కు పంపేది లేదన్నారు.

విద్యుత్ అభివృద్ధి చార్జీలు రద్దు చేయాలి

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ అభివృద్ధి చార్జీలను రద్దు చేయాలని విద్యుత్ వినియోగదారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చైతన్య డిమాండ్ చేశారు. ఆయన శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ట్రూ అప్ చార్జీలు, విద్యుత్ సుంకం రూపేణా వినియోగదారులపై మోపుతున్న భారం చాలడం లేదా అన్నారు. అభివృద్ధి చార్జీలను పూర్తిగా ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చక్రవర్తిరెడ్డి, శ్రీనివాసమూర్తి, సొకత్, సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



పలమనేరు కోర్టులో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



వి.కోటలో యోగాసనాలు వేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: పట్టణంలో పలు చోట్ల అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ అధికారులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి స్థానిక బాలికోన్నత పాఠశాలలో యోగాసనాలు వేయించి అవగాహన కల్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్థానిక ఏరియా ఆస్పత్రి, ఏపీ ఎన్జీవోలు, పీపీఎస్, వాణి విద్యాశ్రమంలో యోగా మాస్టర్లతో కార్యక్రమాలు జరిగాయి. జూనియర్ సివిల్ జడ్జి లిఖిత, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. హెచ్‌ఎం జయకుమార్‌రెడ్డి, విద్యార్థులు, టీచర్లు కలిసి యోగాసనాలు వేశారు. ఆసనాల్లో ప్రతిభ చూపిన వారికి తహసీల్దారు ప్రమీల, ఎంపీడీఓ హరిబాబు బహుమతులు అందజేశారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: యోగా దినోత్సవంలో భాగంగా మండలంలో 70 చోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో యోగా చేశారు. మండల ప్రత్యేక అధికారి వేంకటేశ్వరి, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీఓ అమరనాథ్, ఎంఈఓ శ్రీనివాసులు, కేజీబీవీ ప్రత్యేక అధికారి సుజాత, పీహెచ్‌సీ వైద్యాధికారులు దినేష్‌కుమార్‌రెడ్డి, వినయ్, ట్రాన్స్‌కో ఏఈ రాంప్రసాద్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, సర్పంచ్ ఇబ్రహీంఖాన్ పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పం: కడా ఆధ్వర్యంలో యోగాంధ్ర పేరుతో పట్టణంలోని ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 5వేల మందికి పైగా పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ యోగా కార్యక్రమం నియోజకవర్గంలోని 1000 కేంద్రాల్లో జరిగినట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. కుప్పం ద్రావిడ వర్సిటీలో ఉదయం 6.30 గంటల నుంచే వీసీ ఆచార్య దొరస్వామి ఆధ్వర్యంలో సిబ్బంది, విద్యార్థులు యోగాసనాలు వేశారు. అనంతరం వర్సిటీలోని ప్రతి విభాగం వద్ద క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టి మొక్కలను నాటారు. వర్సిటీ యోగా కో–ఆర్డినేటర్ డా.డి.జ్యోతమ్మ, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: పీఈఎస్ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో యోగా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. అనంతరం యోగా శిక్షకులు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందితో యోగాసనాలు వేయించారు. మెడికల్ సూరింటెండెంట్ సుబ్రమణ్యం పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు ప్రిన్సిపల్ రామక్రిష్ణమనాయుడు వివరించారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ బాలాజి, తహసీల్దార్ అనిల్‌కుమార్ రెడ్డి, రాయలపేటలో ఈఓపీఆర్డీ శారదాదేవి పాల్గొన్నారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా కల్లూరు హైస్కూల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి హెచ్‌ఎం శ్రీవాణి యోగాసనాలు వేశారు.

వి.కోటలో

వి.కోట: పట్టణంలోని బాలుర పాఠశాల ఆవరణలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి యోగాసనాలు చేశారు. ఎంఈఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: విజయవాణి రెసిడెన్సియల్ స్కూల్ ఆవరణలో 700 మంది విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్, ఎంపీడీఓ లీలామాధవి, తహసీల్దార్ పార్వతి, ఎంఈఓ కేశవరెడ్డి, ఏఓ గురుప్రసాద్, విజయవాణి విద్యాసంస్థల అధినేత నాయుని చంద్రశేఖర్‌మూర్తి పాల్గొన్నారు. అలాగే మండలంలోని సచివాలయాలు, పాఠశాలల్లో యోగా దినోత్సవం నిర్వహించారు.



చౌడేపల్లెలో విద్యార్థుల యోగాసనాలు



పీఈఎస్ మెడికల్ కళాశాలలో..

మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న ఎంపీడీఓ, తహసీల్దార్

పెద్దపంజాణి: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ బాలాజి, తహసీల్దార్ అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రతి మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈఓపీఆర్డీ శారదాదేవి, డీటీ యోగేష్, ఏపీఎం మీరాబాయి, ఏపీఓ మురుగేషన్ పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ



మొక్కలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు, ట్రస్టు ప్రతినిధులు

శాంతిపురం: ఒక్కో విద్యార్థికి ఓ మొక్కను అందించి, ఐదేళ్లపాటు వాటిని సంరక్షించే బాధ్యతలు ఇవ్వడం ద్వారా భావి తరాల వారికి మొక్కల పెంపకం ప్రాధాన్యతను తెలిపే ప్రయత్నం చేస్తున్నామని గ్రేసీ మేరీ ట్రస్ట్ ప్రతినిధి ఆరోగ్యరాజ్ తెలిపారు. శనివారం ట్రస్టు ఆధ్వర్యంలో శాంతిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో చేరిన విద్యార్థులకు మొక్కలను అందజేశారు. పాఠశాల ఆవరణలో వాటిని నాటి 10వ తరగతి పూర్తి అయ్యే వరకూ వాటిని పెంచాలని కోరారు. ఉపాధ్యాయులు మల్లికార్జున, దయానంద్, ట్రస్టు సిబ్బంది జేసుమేరీ పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

- కంపుకొడుతున్న పల్లెలు
- అందని నిధులు
- కార్యదర్శుల బదిలీలతో పట్టుతప్పిన పాలన
- 15వ ఆర్థిక సంఘం నిధుల కోసం ఎదురుచూపులు

పలమనేరు: పల్లెలు బాగుంటేనే దేశం బాగుంటుందని మహాత్మగాంధీ అన్న మాట. కానీ గ్రామ పంచాయతీలకు అవసరమైన నిధులందక సమస్యలు ఏకరువు పెడుతున్నాయి. 15వ ఆర్థిక సంఘ నిధులు తొలి విడతకు సంబంధించి కొన్ని పంచాయతీలకు అందలేదు. ఇప్పటికే అందాల్సిన రెండో స్పెల్ నిధులు ఎప్పుడు వస్తాయో తెలియడం లేదు. తొలివిడత అందిన నిధుల్లో పాత బకాయిలకు సగం పోగా మిగిలిన నిధులతో పనులు చేపట్టలేదు. బేసిక్ గ్రాంట్‌లో టైడ్‌కు సంబంధించి గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, రిపేర్లకు ఈ నిధుల నుంచే ఖర్చుచేయాల్సి ఉంది. కానీ ఇవి ఇంకా అందకపోవడంతో గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. దీనికి తోడు జెడ్పీ, మండల గ్రాంట్లకు సంబంధించిన నిధులకు కూటమి నేతలు అడ్డుకట్ట వేశారు.

రెండో స్పెల్ నిధులందితేనే పనులు

నియోజకవర్గంలో ఐదు మండలాలు, 90 పంచాయతీలున్నాయి. 15వ ఆర్థిక సంఘ నిధులు 2024–25 ద్వారా రెండో ఇన్‌స్టాల్‌మెంటు కింద బేసిక్ గ్రాంటు అన్‌టైడ్(సీసీ రోడ్లు, భవనాలు, డ్రైన్లు) ద్వారా బైరెడ్డిపల్లి మండలానికి రూ.50.54లక్షలు, గంగవరానికి రూ.47లక్షలు, పలమనేరుకు రూ.15.26లక్షలు, వి.కోటకు రూ.73.26లక్షలు, పెద్దపంజాణికి రూ.51.86 లక్షలు మొత్తం నియోజకవర్గానికి రూ.2.30కోట్లు రావాల్సి ఉంది. టైడ్ గ్రాంటులో రెండో విడత బైరెడ్డిపల్లి మండలానికి రూ.75.81, గంగవరానికి రూ.71.01, పలమనేరుకు రూ.22.90, పెద్దపంజాణికి రూ.77.80, వి.కోటకు రూ.109.89లక్షలుగా మొత్తం నియోజకవర్గానికి రూ.27.90కోట్లు అందాల్సి ఉంది. ఈ నిధుల ద్వారానే గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా, మైనర్ రిపేర్లకు వినియోగించుకోవాలి.

నిధులు వచ్చినా కూటమి నేతలదే హవా

నియోజకవర్గంలో 90శాతం మంది ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీకి చెందినవారున్నారు. దీంతో గతంలో విడుదలైన మండల, జెడ్పీ నిధులకు సంబంధించిన పనులను కూటమి నేతలకే దక్కేలా సంబంధిత ఎంపీడీఓలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రెండో విడత నిధులందినా కూటమి నేతల పెత్తనమే సాగడం ఖాయం. కానీ పంచాయతీల పరిధిలో తాగునీటి కోసం, మోటార్లు, స్టార్టర్లు, మైనర్ రిపేర్లకు సర్పంచులు అప్పు చేసిన పెట్టిన డబ్బులు ఇవ్వలేక ఇక్కట్లు పడుతున్నారు.

సమస్యలు ఎక్కువ..



మా పంచాయతీలో డ్రైనేజీలు దెబ్బతిన్నాయి. ప్రజలకు సరిపడా మంచినీరు కావాలంటే మరో రెండు మంచి నీటి బోర్లను డ్రిల్ చేసి వాటికి మోటార్లు, పైప్‌లైను అవసరముంది. కానీ తగినంత నిధులు రాలేదు. చిన్నపాటి పనులకు అప్పు చేసి పెడుతున్నాం. సెకెండ్ స్పెల్ వస్తేగానీ కొంత వరకు సమస్యలు తీరేలాలేవు. అవి ఎప్పుడొస్తాయో తెలీదు. –మునస్వామి, సర్పంచ్, టి.వడ్డూరు



గంగవరం మండలం కొంగోళ్లపల్లి కాలువలో పేరుకుపోయిన చెత్త



